క్లుప్తంగా

కల్యాణం... వైభోగం



కల్యాణ వేదికపై ఉభయ దేవేరులతో బాలబాలాజీ స్వామి

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి మాస కల్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీదేవి, భూదేవి మెడలో ఆ బాల బాలాజీ స్వామి మాంగల్యధారణ చేశారు. భక్తుల గోవింద నామస్మరణ నడుమ వధువుల శిరస్సుపై జీలకర్ర, బెల్లం పెట్టి కల్యాణ క్రతువును వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వామివారి మాస కల్యాణం జరిగింది. ఇందులో పలువురు భక్తులు కర్తలుగా పాల్గొన్నారు. కల్యాణం అనంతరం అర్చకుల నుంచి వేదాశీర్వచనం, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామివారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం వైభవోపేతంగా జరిపించారు.

రీ సర్వేకి సహకరించాలి



మామిడికుదురు గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సునీల్‌కుమార్

మామిడికుదురు: రీ సర్వేకి ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని తహసీల్దార్ పి.సునీల్‌కుమార్ అన్నారు. మామిడికుదురు గ్రామ పంచాయతీ వద్ద శుక్రవారం రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. తొలుత అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసేందుకే రీ సర్వే చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరూ భూమికి సంబంధించిన తమ నక్షలను రెవెన్యూ అధికారులకు అందించి భూ సరిహద్దులు నిర్ధారించుకోవాలన్నారు. బి.దొడ్డవరం, లూటుకుర్రు గ్రామాల్లో రీ సర్వే ప్రారంభమైందన్నారు. సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, సొసైటీ చైర్మన్ ఈలి శ్రీనివాస్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సాయం



రామరాజులంకలో పాఠశాల అభివృద్ధికి విరాళం ఇస్తున్న ఎన్నారై రాజశేఖర్

మలికిపురం: రామరాజులంక జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఎన్నారై, పూర్వ విద్యార్థి చొప్పల రాజశేఖర్ రూ.లక్ష విరాళాన్ని శుక్రవారం అందజేశారు. ఆ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పైమొత్తాన్ని హెచ్ఎం కేవీఆర్ఎస్ లక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ రావూరి రాజా రమేష్‌లకు ఆయన ఇచ్చారు. రాజా రమేష్ మాట్లాడుతూ దాతలు, ఉపాధ్యాయుల సహకారంతో పాఠశాలకు ట్రాన్స్‌పోర్టు వాహనాన్ని సమకూర్చుతామని, తద్వారా రామరాజులంక శివారు బాడవ ఏరియా నుంచి విద్యార్థులు పాఠశాలకు చేరుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. యేపుగంటి వెంకట పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ర్యాలిలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న శ్యామ్ తదితరులు

కొత్తపేట: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందని ప్రముఖ ఇంద్రజాలకుడు చింతా శ్యామ్‌కుమార్ (శ్యామ్ జాదూగర్) అన్నారు. ఆత్రేయపురం మండలం ర్యాలి అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్యామ్ జాదూగర్ పర్యవేక్షణలో మండలంలో కొత్తగా ఉపాధ్యాయులుగా నియమితులైన ఆకాశం సూర్యప్రకాష్, మణికుమారి, హిమబిందు, దుర్గాదేవి, మౌనికలను శ్యామ్‌లను పలువురు సత్కరించారు. డాక్టర్లు సూర్యచంద్రరావు, గౌరీబాబు, మోహిత్ కృష్ణ, సీత, చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అన్నపూర్ణ, తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రోగికి చేయూత

సఖినేటిపల్లి: సఖినేటిపల్లి లాకుపేటలో శుక్రవారం అనారోగ్యంతో బాధపడుతున్న నల్లి కిషన్ కింగ్ (కరాటే శ్రీను)కు, కువైట్ కేంద్రంగా ఉన్న గల్ఫ్ గృహ కార్మికుల హెల్పింగ్ హ్యాండ్స్ రూ.13 వేల సాయం అందజేసింది. పైమొత్తాన్ని రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు చేతుల మీదుగా రోగికి అందజేశారు. ప్రతినిధులు రాపాక చిన్ని, నల్లి ప్రసాదరావు, పాలపర్తి శేఖర్, కనికిపాటి ఏసురాజు, నల్లి మోహన్, మోకా దివాకర్, కె.చింటూ పాల్గొన్నారు.

జలజీవనం



ముక్తేశ్వరం - అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వేపై రాకపోకలు



జొన్నాడ వద్ద ప్రవహిస్తున్న గౌతమీ గోదావరి



అప్పనపల్లి కాజ్‌వేపై వరద నీటిలో రాకపోకలు

మామిడికుదురు: గోదావరి వరద ఉధృతి కాస్త నెమ్మదిస్తోంది. అయితే ఇంకా పూర్తిస్థాయిలో వరద వీడలేదు. శుక్రవారం అప్పనపల్లి కాజ్‌వేపై ఇంకా వరద నీరు ఉంది. దీంతో అప్పనపల్లి, పెదపట్నం లంక, బి.దొడ్డవరం గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. అప్పనపల్లి ఉచ్చులవారిపేట చర్చి సమీపంలో సీసీ రోడ్డు వరద నీటి నుంచి బయట పడింది. దీంతో ఇక్కడ ఇబ్బందులు తొలగాయి. శ్రీబాల బాలాజీ స్వామి స్నానఘట్టం ఇంకా పూర్తిగా వరద నీటిలోనే ఉంది. ఇక్కడ అమృత లింగేశ్వరస్వామి విగ్రహం గోపురం ఆనవాలు మాత్రమే కనపడుతోంది. గరుత్మంతుడి విగ్రహం సగానికి పైగా మునిగిపోయింది. పెదపటన్నం మధ్యలంక ఇంకా ముంపు నీటిలోనే ఉంది. దీంతో రైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. పాశర్లపూడిబాడవలో రిసార్ట్స్‌తో పాటు కనకదుర్గ ఆలయం, శివాలయం ఇంకా ముంపు నీటిలోనే ఉంది.

ఆలమూరు మండలంలో..

ఆలమూరు: మండలంలోని లంక ప్రాంతాల వెంబడి గౌతమీ గోదావరికి వరద నీటి ప్రవాహం కాస్త తగ్గుతుంది. భారీ వర్షాలకు తోడు ఎగువ ప్రాంతమైన భద్రాచలం నుంచి వచ్చే వరద నీటితో పాటు శబరి నది ఉధృతి కారణంగా రెండు రోజులుగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 175 గేట్లను తెరిచి సముద్రంలోకి నీటిని వదులుతున్నారు. ఈ ఏడాది నాలుగో సారి కూడా వరద నీరు ముంచెత్తడంతో పరివాహక ప్రాంతాలైన బడుగువానిలంక, మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల, జొన్నాడ, ఆలమూరు గ్రామాల్లోని రైతులు ఆందోళన చెందుతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా గోదావరికి ఎక్కువ సార్లు వరదలు రావడతంతో లంక భూములు నదీ కోతకు గురయ్యాయని ఆవేదన చెందారు. ఇప్పటికీ జొన్నాడ, బడుగువానిలంక పుష్కరఘాట్‌లు వరద నీటిలో ఉన్నాయి. అయితే ఎగువ ప్రాంతాల్లో తగ్గుతుండడంతో అంతా ఊపిరి పీల్చుకుంటున్నారు.

సముద్రంలోకి మిగులు జలాలు..

గోదావరికి వరద నీరు రావడంతో ఈ ఏడాది రికార్డు స్థాయిలో వృథా జలాలను సముద్రంలోకి వదులుతున్నారు. ఆగస్టు మూడవ వారం నుంచి ఏకధాటిగా ప్రతి రోజు సుమారు ఎనిమిది లక్షల క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతూనే ఉన్నారు. ఇప్పటి వరకూ నాలుగు నెలల పాటు జూలై నుంచి అక్టోబర్ వరకూ వరద నీరు ప్రవహించిన దాఖలు లేవని లంక రైతులు చెబుతున్నారు. దీనివల్ల పంటలు కూడా వేసుకోలేని పరిస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నారు.

అయినవిల్లి: ముక్తేశ్వరం – అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వే వద్ద వరద తగ్గడంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం వరకూ రెవెన్యూ సిబ్బంది పడవలను నడిపారు. కాజ్‌వేపై నీరు తగ్గడంతో సాయంత్రం రాకపోకలు ప్రారంభించారు. పడవలను నిలిపేశారు. వరద వల్ల పల్లపు ప్రాంతాల్లోకి నీరు చేరడంతో రోగాలు ప్రబలుతాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో పంచాయతీ అధికారులు బ్లీచింగ్ చల్లించాలని, తాగునీటి ట్యాంక్‌ల్లో క్లోరినేషన్ చేయాలని కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సఖినేటిపల్లి, రాజోలు: రాజోలులో 132 కేవీ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం రాజోలు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. మలికిపురం, సఖినేటిపల్లి, రాజోలు, మామిడికుదురు మండలాలతో పాటు పి.గన్నవరం మండలంలో సరఫరాలో ఉండదన్నారు.

మూడో దశ రీసర్వే ప్రారంభం

కొత్తపేట: స్థానిక రెవెన్యూ డివిజన్ పరిధిలో రీసర్వే ప్రాజెక్టు మూడో దశ ప్రక్రియ ప్రారంభించినట్టు ఆర్డీఓ పి.శ్రీకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని 3 మండలాల పరిధిలో 10 గ్రామాల్లో రీసర్వే ప్రారంభించామన్నారు. అయినవిల్లి మండలం కొండుకుదురు, క్రాప, కె.జగన్నాథపురం, చింతనలంక, అంబాజీపేట మండలం చిరతపూడి, కె.పెదపూడి, పి.గన్నవరం మండలం ముంగండపాలెం, కె.ముంజవరం, కఠారిలంక, మొండెపులంక గ్రామాల్లో సర్వే జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల్లో భూముల వివరాలు, హద్దులు, యజమానుల సమాచారం ఆధునిక సాంకేతికతతో రీసర్వే చేపడతారని తెలిపారు. గ్రామస్తులు, భూ హక్కుదారులు వారి భూమి పత్రాలు, ఆధారాలు సిద్ధంగా ఉంచుకుని, అధికారులకు సహకరించాలని ఆర్డీఓ కోరారు.

ధర్నా విజయవంతం చేయండి



ఫ్యాప్టో మహా ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజోలు: ఉపాధ్యాయుల సమస్యలపై ఈ నెల 7న విజయవాడలో నిర్వహించే ఫ్యాప్టో మహాధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు ఆర్ఆర్‌కే ప్రసాద్, కేశవరావు శుక్రవారం పిలుపునిచ్చారు. స్థానిక మండల రిసోర్స్ కార్యాలయం వద్ద జరిగిన రాజోలు తాలూకా సమావేశంలో మహాధర్నా కరపత్రాలు ఆవిష్కరించారు. ఏకీకృత సర్వీసులను పరిష్కరించాలని, పీఆర్సీ కమిషన్ వెంటనే ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయులను బోధనేతర విధుల నుంచి తప్పించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. నాయకులు కల్యాణబాబు, కె.రాజబాబు, వైవీవీ ప్రసాద్, నారాయణస్వామి, బేతినీడి శ్రీనివాస్, శ్యాంసన్, గోపీరాజ్, గెద్దాడ రాధాకృష్ణ, అడబాల కాశీ తదితరులు పాల్గొన్నారు.

డ్రై డేతో వ్యాధులు దూరం



కలవచర్లలో దోమల నిర్మూలనపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడం ద్వారా వ్యాధులను దూరం చేయవచ్చని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ ఇన్‌చార్జ్ వైద్యాధికారులు డి.శిరీష, వంశీ అన్నారు. డ్రైడే ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్లకార్డులు ప్రదర్శించి దోమల వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. అలాగే రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలు ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సీహెచ్ఓ ఎంఎస్ఎస్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, ఆర్.బాలామణి తదితరులు వైద్య సేవలను పర్యవేక్షించారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

అంబాజీపేట: స్థానిక పెదవీధి శివారు శ్రీవిజయ భేతాళస్వామి ఆలయం నుంచి పోతాయిలంక ప్రధాన రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే సత్యనారాయణ శుక్రవారం భూమిపూజ చేశారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.1.10 కోట్లతో ఈ పనులు చేస్తున్నామన్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి పాల్గొన్నారు.

'వాహన మిత్ర'కు ఎంపిక

ఆలమూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న వాహన మిత్ర పథకానికి మండలంలో వివిధ గ్రామాలకు చెందిన 360 మందిని ఎంపిక చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాజు శుక్రవారం మాట్లాడుతూ మండలంలో 387 మంది వాహన మిత్ర పథకానికి దరఖాస్తు చేసుకోగా, అందులో 27 మందిని అనర్హులుగా ప్రభుత్వం గుర్తించిందన్నారు. అర్హులైన ఆటో డ్రైవర్లందరికీ తమ బ్యాంకు ఖాతాల్లో రూ.15 వేల చొప్పున జమ చేస్తారన్నారు.

వృత్తి విద్యపై శిక్షణ

రాజోలు: కడలి జెడ్పీహెచ్ఎస్ ప్లస్ విద్యార్థులకు వృత్తి విద్య ఇంటర్న్‌షిప్ శిక్షణ పూర్తి చేశామని ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. తాటిపాకలో 10 రోజుల పాటు రిటైల్ ట్రేడ్‌లో కె.పెద్దిరాజు, ఎలక్ట్రానిక్స్ ట్రేడ్‌లో ఎ.గౌతమి శిక్షణ ఇచ్చారన్నారు. కస్టమర్ సర్వీస్, బిల్లింగ్ ప్రోసెస్, స్టాక్ మేనేజ్‌మెంట్, సేల్స్ టెక్నిక్స్, ఎలక్ట్రానిక్స్‌లో మరమ్మతులు, మెయింటెనెన్స్, ట్రబుల్ షూటింగ్, ఎలక్ట్రానిక్ కంపోనెంట్ల గుర్తింపు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఉపాధి కోర్సులపై దృష్టి సారించాలి

ఆలమూరు: విద్యార్థులు చదువుతో పాటు ఉపాధి కోర్సుల్లో నైపుణ్యం పొందాలని జిల్లా జీసీడీఓ భీమారావు సూచించారు. స్థానిక డాక్టర్ బొబ్బా జయశ్రీ జిల్లా పరిషత్ బాలికోన్నత ప్లస్ పాఠశాలలో పది రోజుల నుంచి జరుగుతున్న బ్యూటీ అండ్ వెల్‌నెస్ కోర్సులపై అంతర్గత శిక్షణ సదస్సు ముగిసింది. ప్రధానోపాధ్యాయురాలు వై.కమల ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల బృందం శుక్రవారం ఒకేషనల్ కోర్సులో శిక్షణ ఇచ్చిన మాదాల లక్ష్మి, జీసీడీఓ భీమారావు సమక్షంలో శిక్షణ పొందిన పది మంది విద్యార్థినులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

దళితులపై పెరుగుతున్న దాడులు



తాటిపాక సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బుజ్జి

రాజోలు: దళితులపై జరుగుతున్న దాడులకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని జిల్లా దళిత చైతన్య వేదిక అధ్యక్షుడు లిఖితపూడి బుజ్జి అన్నారు. శుక్రవారం తాటిపాకలో మండల దళిత చైతన్య వేదిక సమావేశం అధ్యక్షుడు మందపాటి మధు అధ్యక్షతన జరిగింది. రాష్ట్రంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. దళితులపై దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. మధురపూడి ఎయిర్‌పోర్టు సమీపంలో దళిత యువకుడిపై హత్యాయత్నానికి ప్రయత్నించిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా దేవళ్లంపేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన సంఘటనపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల మురళీకృష్ణ, నాయకులు చిలకపాటి శ్రీధర్, చింతా శ్రీనివాస్, పొన్నమాటి భాస్కర్, గోగి మోహన్, కారుపల్లి గోపాలం, బొడ్డపల్లి ప్రసాద్, బుంగ శ్రీనివాస్, కడలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రంగా విగ్రహావిష్కరణ



అయినాలవారి పాలెంలో రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

పి.గన్నవరం: మండలంలోని రాజులపాలెం శివారు అయినాలవారి పాలెంలో విజయవాడ మాజీ ఎమ్మెల్యే, దివంగత వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని యూత్ నాయకుడు గంధం పల్లంరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి రంగా అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, మహిపాల తాతాజీ, ఆదిమూలం సూరయ్యకాపు తదితరులు పాల్గొన్నారు.

యువతకు గాంధీజీ ఆదర్శం కావాలి



పి.గన్నవరంలో గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు



కొత్తపేట మండల పరిషత్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: నేటి యువతకు మహాత్మా గాంధీ ఆదర్శం కావాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జాతి నేతల విగ్రహాలకు ఎంపీపీ పూలమాలలు వేశారు. ఎంపీటీసీ సభ్యులు పేపకాయల బ్రహ్మానందం, నేలపూడి భీమరాజు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపం, సమితి రోడ్డు సెంటర్, పాత బస్టాండ్ సెంటర్‌లో జిల్లా, మండల, గ్రామ ఆర్యవైశ్య సంఘం నాయకులు తమ్మన సాయిప్రసాద్, కోట్ల ప్రభాకర విశ్వేశ్వరరావు, బాబి, రాధాకృష్ణ, ఎస్ఎస్ యూకే లింగేశ్వరరావు ఆధ్వర్యంలో మహాత్ముని విగ్రహానికి ఆయన పూలమాలలు వేశారు. పలివెలలో గాంధీ అధ్యయన సంస్థ వ్యవస్థాపకుడు దుళ్ల వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘం నాయకుడు శ్రీరామమూర్తి తదితరులు గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు.

పి.గన్నవరం: స్థానిక అక్విడెక్టు పార్కులో పి.గన్నవరం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పాబోలు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో గాంధీ జయంతిని నిర్వహించారు. నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, వంకాయల బాలయ్య, కొల్లా శ్రీను, శ్రీఘాకోళపు లక్ష్మీపతి, పల్లపోతు శ్రీరామచంద్రమూర్తి, వంకాయల గంగరాజు, కూరపాటి లీలాప్రసాద్ పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి అవకాశాలు

తాళ్లరేవు: తీరప్రాంతంలోని కోరింగా అభయారణ్యంలో పర్యాటకాభివృద్ధికి పుష్కలమైన అవకాశాలున్నాయని జిల్లా అటవీశాఖాధికారి ఎస్.రామచంద్రరావు తెలిపారు. జిల్లా అటవీశాఖాధికారిగా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన కోరింగా అభయారణ్యాన్ని సందర్శించారు. కోరంగి బయోడైవర్సిటీలో నిర్వహిస్తున్న వన్యప్రాణి వారోత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాకినాడ డివిజన్ ఫారెస్ట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత వారోత్సవాల పోస్టర్‌ను అధికారులు ఆవిష్కరించారు.



కొత్తపేట బి.సావరంలో దుర్గాదేవి సన్నిధిలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి



అంతర్వేది ఆలయంలో మాజీ ఎంపీ భరత్‌రామ్ తదితరులు



అప్పనపల్లి బాలాజీ ఆలయంలో శమీపూజలో పాల్గొన్న భక్తులు



తాటికాయలవారిపాలెంలో కనకదుర్గమ్మ వారు



అయినవిల్లిలో దాత సత్యనారాయణకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ప్రధానార్చకుడు

దుర్గామాతకు జేజేలు

- ముగిసిన శరన్నవరాత్ర ఉత్సవాలు



అంబాజీపేటలో వాసవీ మాత జాతరలో శక్తి వేషధారణలు

కొత్తపేట: దుర్గామాతకు భక్తులు జేజేలు పలికారు.. ఆ అమ్మవారిని కొలుస్తూ సాగిన శరన్నవరాత్ర ఉత్సవాలు అట్టహాసంగా ముగిశాయి. విజయదశమి పర్వదినం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కనకదుర్గాదేవి ఆలయాలను సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపేట బొరుసువారిసావరంలో విజయ కనకదుర్గాదేవిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ పోషకుడు బొరుసు వెంకట ఉదయభాస్కర్ పూలమాల, శాలువాతో సత్కరించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, నాయకుడు కర్రి నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

అంబాజీపేట: స్థానిక పెద్దవీధిలోని భేతాళ స్వామి ఆలయంలో విజయ భేతాళునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాచవరం శివారు పక్షుల రావి చెట్టు వద్ద శ్రీరాంనగర్‌లో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు జరిగాయి. మెట్లకాలనీ, గంగలకుర్రు, ముక్కామల, పుల్లేటికుర్రు, మొసలపల్లి, వాకలగరువు తదితర గ్రామాల్లో దేవీ నవరాత్ర ఉత్సవ పందిర్ల వద్ద అన్న సమారాధనలు నిర్వహించారు. అంబాజీపేటలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరీదేవిగా అలంకరించి ఊరేగించారు. తీన్‌మార్ డప్పు వాయిద్యాలు, వివిధ అమ్మవార్ల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

అంతర్వేది స్వామి సన్నిధిలో భరత్‌రామ్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో శుక్రవారం రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో నిర్వహిస్తున్న నారసింహ సుదర్శన హోమంలో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం అధికార ప్రతినిధి తాడి సహదేవ్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కంకిపాడు గ్రామానికి చెందిన వీవీఎస్ సత్యనారాయణ రూ.20,701, హైదరాబాద్‌కు చెందిన శ్రీకాకొలపు వెర్రియ్య, వీర ప్రద్యుమ్న దంపతులు రూ.10,116, ఆత్రేయపురం మండలం బొబ్బర్లంకకు చెందిన జాన చిన్న సత్యనారాయణ, సుగుణ కుమారి దంపతులు రూ.10,116 విరాళాలను సమర్పించారు. ఈ మొత్తాన్ని ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు దాతలు అందజేశారు. వారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదం ఇచ్చారు.

పూర్ణాహుతితో ఉత్సవాలు సంపూర్ణం

మామిడికుదురు: పదకొండు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన కనకదుర్గమ్మ శరన్నవరాత్ర మహోత్సవాలు గురువారం పూర్ణాహుతితో సంపూర్ణమయ్యాయి. విజయదశమి సందర్భంగా దుర్గమ్మ ఆలయాలు భక్తులతో కోలాహలంగా మారాయి. వేలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. అప్పనపల్లిలో శ్రీమహాలక్ష్మి అమ్మవారు విజయలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పాశర్లపూడిబాడవ ఆలయంలో తోరం వెంకటరమణారావు ఆధ్వర్యంలో శమీపూజ, గోపూజ, తెప్పోత్సవం ఘనంగా చేశారు. మగటపల్లి త్రిశక్తి పీఠంలో మహా పూర్ణాహుతి జరిగింది. పెదపట్నంలంక కనకదుర్గమ్మ ఆలయం వద్ద శమీపూజ, మహా పూర్ణాహుతి వైభవంగా నిర్వహించారు. మామిడికుదురు విజయదుర్గమ్మ ఆలయం వద్ద అన్న సమారాధన ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల్లో మేళతాళాలతో అమ్మవార్ల ఊరేగింపులు జరిగాయి.

హంస వాహనంపై ఊరేగింపు

పి.గన్నవరం: దేవీ నవరాత్ర మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. విజయ దశమి సందర్భంగా పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెంలో కనకదుర్గమ్మ వారి ఉత్సవ విగ్రహాలను హంస వాహనంపై ఉంచి, బాణసంచా కాలుస్తూ ఊరేగించారు. తొలుత అమ్మవారికి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. స్థానిక ఏజీ రోడ్డులో శ్రీలక్ష్మీ కనకదుర్గమ్మ వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

కొత్తపేట: శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. గత నెల 22న ఉత్సవాలు ప్రారంభం కాగా గ్రామాల్లో దుర్గాదేవి ఆలయాలు, ఉత్సవ పందిర్లలో శక్తి స్వరూపిణిగా అమ్మవారిని ప్రతిష్ఠించారు. విజయదశమి సందర్భంగా అమ్మవార్లను రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. స్థానిక బొరుసువారి సావరం విజయకనకదుర్గాదేవి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పోషకుడు బొరుసు వెంకటుదయభాస్కర్ పర్యవేక్షణలో ఆలయ ప్రెసిడెంట్ పసుపులేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు పూజలు నిర్వహించారు. ఏనుగులమహల్ రాజరాజేశ్వరీదేవి ఆలయాన్ని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, షిర్డీసాయి బాబా ఆలయం, బోడిపాలెం దుర్గాదేవి ఆలయం, వాడపాలెం జ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో సంబరాలు జరిగాయి. అలాగే విద్యార్థులు, యువకులు, మహిళలు జమ్మిచెట్టు వద్ద శమీ పూజలు చేశారు.